సాక్షి
వికారాబాద్

సోమవారం । 19 । ఆగస్టు । 2024



ఉద్యమ నేతకు పట్టాభిషేకం
ఉద్యమ నేత కోదండరాంకు ఎమ్మెల్సీ పదవి దక్కడం అభినందనీయమని రవీందర్‌గౌడ్ అన్నారు. 8లో▸



నలుగురి సభ్యత్వం రద్దు
అసోసియేషన్‌కు వ్యతిరేకంగా పని చేస్తున్న వారి సభ్యత్వం రద్దు చేస్తున్నామని ముస్లిం వెల్ఫేర్ ప్రతినిధులు తెలిపారు. 8లో▸



ఏళ్ల తరబడి వెట్టిచాకిరీ!
పంచాయతీల్లో కీలకపాత్ర పోషిస్తున్న కారోబార్ల జీవితాలు ఏళ్లు గడుస్తున్నా మారడం లేదు. 9లో▸

న్యూస్‌రీల్

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్
ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే టీఆర్ఆర్

పరిగి: సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మేలు చేకూరుతుందని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పట్టణ కేంద్రంలోని తన నివాసంలో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా ఆరోగ్య సమస్యలున్న ప్రతీ ఒక్కరికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కులు అందజేస్తున్నామన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తుందన్నారు. అర్హులందరికీ పథకాలు అందేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నాడన్నారు. అనంతరం రుకుంపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కృష్ణ, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, నాయకులు శ్రీనివాస్, మల్లేశ్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు పోలీసులపై వేటు
వికారాబాద్: బీజేపీ పూడూరు మండలాధ్యక్షుడు రాఘవేందర్‌పై జరిగిన దాడి విషయంలో ఘటనలో ఇద్దరు పోలీస్ సిబ్బందిపై ఉన్నతాధికారులు వేటు వేశారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతోందని తహసీల్దార్, కలెక్టర్‌కు రాఘవేందర్ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఈనెల 16న అధికార పార్టీ నాయకులు బీజేపీ మండలాధ్యక్షుడు రాఘవేందర్‌పై దాడి చేస్తున్న సమయంలో ఇద్దరు పోలీస్ సిబ్బంది ప్రైవేట్ వ్యక్తుల వాహనంలో ఉన్నారని ఎస్పీ కార్యాలయంలో పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్పీ నారాయణరెడ్డి విచారణకు ఆదేశించారు. చన్గోముల్ ఠాణాలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య, హోంగార్డు ఆంజనేయులు దాడి సమయంలో ప్రైవేట్ వాహనంలో ఉన్నట్లు తేలడంతో ఉన్నతాధికారులు ఆదివారం ఆ ఇద్దరు సిబ్బందిని ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



పరిగిలో వరి నాట్లు వేస్తున్న రైతులు

వరి.. వర్రీ!

సగానికి తగ్గిన సాగు
- గతేడాది 1.35లక్షల ఎకరాల్లో.. ● ఈ ఏడాదికి ఇప్పటి వరకు 50 వేల ఎకరాల్లోనే నాట్లు
- నెలాఖరు వరకు వేసుకోవచ్చని వ్యవసాయ శాఖ సూచన

వికారాబాద్: ఈ ఏడాది వరిసాగుపై నీలి నీడలు కమ్ముకున్నాయి. వర్షాకాలంలో వచ్చిన మార్పులతో ఈ ఏడాది వరి సాగు గణనీయంగా తగ్గే అవకాశం కనిపిస్తుంది. ప్రస్తుతం రైతులు వరినాట్లు వేయడంలో నిమగ్నమయ్యారు. జిల్లాలలోని పరిగి నియోజకవర్గంతో పాటు వికారాబాద్ నియోజకవర్గ పరిధిలోని ధారూరు, కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, తాండూరు నియోజకవర్గ పరిధిలోని యాలాల్ మండలాల్లో వరి అత్యధికంగా సాగు చేస్తారు. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 93 వేల ఎకరాలు కాగా.. గత నాలుగు సంవత్సరాలుగా విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. గతేడాది 1.35 లక్షల ఎకరాల్లో వరి సాగు చేపట్టగా.. ఈ ఏడాది ఇప్పటి వరకు 50 వేల ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ ఏడాది చెరువుల్లో ఆశించిన మేర నీరు లేక సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆందోళనలో అన్నదాత

నేటికీ వర్షాలు సమృద్ధిగా కురియక పోవడంతో రైతులు వరి నాట్లు వేసే విషయంలో తర్జనభర్జన పడుతున్నారు. రైతులంతా నారు పోసుకున్నప్పటికీ సగం మంది మాత్రమే నాట్లేశారు. బోర్ల కింద సాగు చేపట్టే రైతులు నాట్లేసినప్పటికీ పంటలు పండుతాయా..? ఎండుతాయా అని ఆందోళన చెందుతున్నారు. అయితే అధికారులు మాత్రం ఈ నెలాఖరు వరకు వరి నాట్లు వేసుకునేందుకు అవకాశం ఉందని సూచిస్తున్నారు. తమ సలహాలు సూచనలతో సాగు చేపడితే వరిలో అధిక దిగుబడులు సాధించ వచ్చునని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వరినాట్లు వేసుకోవటం ఇప్పటికే ప్రారంభం కాగా ఆగస్టు చివరి వారంతో పాటు సెప్టెంబర్ మొదటి వారం వరకు నాట్లు వేసుకోనున్నారు.

40 బస్తాల దిగుబడి

ప్రస్తుతం జిల్లా రైతులు బీపీటీ-5204, ఎంటీయూ-1010, ఎంటీయూ-1001, చిట్టిముత్యాలు తదితర రకాల వరివిత్తనాలు సాగుచేస్తున్నారు. అయితే వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన దాని ప్రకారం సాంబ మసూరి, భరణి, కాటన్‌దొర సన్నాలు, సోమశిల, సింహపురి, తెలంగాణ సోనా రకాలను వానాకాలంలో సాగుచేస్తే మంచిదిగుబడులు వస్తాయి. ప్రస్తుతం ఈ ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న ఎంటీయూ-1010, ఎంటీయూ-1001 రకాలు యాసంగిలో వేసుకుంటే మంచిది గుబడులు వస్తాయి. సెప్టెంబర్ మొదటి వారం లోపు వరినాట్లు వేసుకోవటం మంచిది. ఈ రకాల విత్తనాలతో ఎకరానికి 40 బస్తాల దిగుబడి వస్తుంది. యాసంగిలో దిగుబడి మరో ఐదు నుంచి పది బస్తాల వరకు పెరుగుతాయి.

జాగ్రత్తలు
- వరిలో కాండతొలుచు పురుగు, ఆకుముడత తెగులు, దోమపోటు, అగ్గితెగులు ఆశించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.
- కాండం తొలుచు పురుగు నివారణకు నారుమడుల్లో ఒకటిన్నర కిలోల గుళికల మందు చల్లుకోవాలి.
- నాట్లు వేశాక 20 రోజులకు ఎకరానికి 8-10 కిలోల వాసన రాని గుళికల మందు వేసుకోవాలి.
- ఆకుముడత తెగులు నివారణకు కోలరోపైరిపాస్ గాని, మోక్రోటో ఫాస్ మందును గాని పిచికారీ చేసుకోవాలి.
- దోమపోటు నివారణకు ఇమిడా క్లోరోఫిడ్ మందును, అగ్గి తెగులు నివారణకు ట్రైసోక్లోజోన్ మందులను వాడాలి.

మోతాదు మించితే అనర్థం



రైతులు ఈ ప్రాంతంలో అధిక మోతాదులో ఎరువులు వాడుతున్నారు. మోతాదుకు మించి ఎరువులు వాడడం అనర్థాలే ఎక్కువ. యూరియా ఎక్కువగా వాడడంవల్ల పైరు ఎక్కువగా పెరగటం, పచ్చగా మారటంవల్ల పంటను ఆశించే పురుగులు, చీడపీడల శాతం పెరిగి పంట దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంది. అయితే జిల్లాలో రైతులకు ఎంతయితే ఎరువులు అవసరమో అవి అందుబాటు ఉంచాం.

– గోపాల్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి



ఆత్మీయ ‘రక్ష’
మానవ సంబంధాలు దిగజారిపోతున్న రోజుల్లో రాఖీలాంటి పండుగలు అనుబంధాలను గుర్తు చేస్తున్నాయి.అన్నాచెల్లెళ్ల మధ్య అనురాగాన్ని పెంచి అంతరించిపోతున్న ఆత్మీయ బంధాలకు ఊపిరి పోసే వేడుకే రక్షాబంధన్. ఈ ప్రేమానురాగల పండగతో తమకు విడదీయరాని బంధం ఉందని పలువులు సోదర సోదరీమణులు పేర్కొంటున్నారు. చిన్నాపెద్దా తేడాలేకుండా అందరూ జరుపుకొనే ఈ ఉత్సవం సోమవారం నిర్వహించనున్నారు. ఈ పర్వదినం కోసం మార్కెట్లో వివిధ వర్ణాలు, ప్రత్యేక ఆకర్షణలతో కూడిన రాఖీలు కొలువుదీరాయి. ఆత్మీయ ఉత్సవం కోసం ఆదివారం తమకు నచ్చిన రాఖీలను కొనుగోలు చేయడంలో మహిళలు నిమగ్నమయ్యారు.

- వివరాలు 8లో▸

పాపన్నగౌడ్ పోరాటం ఆదర్శం



పాపన్న గౌడ్ జయంతిలో కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు

కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: బడుగు, బలహీనవర్గాలు సర్దార్ సర్వాయి పాపన్న పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బహుజన రాజ్యాన్ని స్థాపించిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అన్నారు. ఎవరి అండదండలు లేకుండా బడుగులను ఏకం చేసి భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడిన వీరుడని గుర్తు చేశారు. అనంరతం వసతిగృహాల విద్యార్థులు దేశభక్తి గేయాలను ఆలపించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో ఉండే బాలబాలికలకు కలెక్టర్ నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి కె.ఉపేందర్, వెనుకబడిన తరగతుల అభివృద్ధి సహాయ అధికారి భీమరాజు, వసతి గృహ సంక్షేమ అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది, వసతి గృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘హైడ్రా’ హడల్



అప్పోజీగూడ పంచాయతీ పరిధిలోని గండిపేట చెరువు ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత


- గండిపేట, హిమాయత్‌సాగర్ జలాశయాల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో భారీగా అక్రమ నిర్మాణాలు
- కొరడా జులుపిస్తున్న హైడ్రా అధికారులు
- కూల్చివేతలు ప్రారంభం
- అక్రమార్కుల గుండెల్లో రైళ్లు

మొయినాబాద్: హైడ్రా అధికారులు హడలెత్తిస్తున్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను హైడ్రా అధికారులు కూల్చి వేస్తున్నారు. నెల రోజులుగా నగరంలోని పలు చెరువుల్లోని ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలను కూల్చి వేస్తున్న అధికారులు ఆదివారం మన జిల్లాపై దృష్టి సారించారు. గండిపేట (ఉస్మాన్‌సాగర్) జలాశయం ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన భారీ నిర్మాణాలను కూల్చివేశారు. ఉదయం 7 గంటలకే హైడ్రా, జలమండలి అధికారులు పోలీసు బందోబస్తుతో అక్రమ నిర్మాణాల వద్దకు చేరుకుని కూల్చి వేతలు మొదలుపెట్టారు. గండిపేట మండలం ఖానాపూర్, శంకర్‌పల్లి మండలం జనవాడ, మొయినాబాద్ మండం చిలుకూరు రెవెన్యూ పరిధిలోని అప్పోజీగూడ, చిలుకూరు, దేవల్ వెంకటాపూర్ గ్రామాల్లో గండిపేట ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన నిర్మాణాలను నేలమట్టం చేశారు. హైడ్రా చేపట్టిన ఈ చర్యలతో గండిపేట, హిమాయత్‌సాగర్ జలాశయాల సమీపంలో నిర్మాణాలు చేపట్టినవారు ఆందోళనకు గురవుతున్నారు. తమ నిర్మాణాలు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోకి వస్తాయా అని ఆరా తీస్తున్నారు. హైడ్రా అధికారులు ఎప్పుడు విరుచుకుపడుతారోనని హడలెత్తిపోతున్నారు.

బడాబాబుల నిర్మాణాలే..

గండిపేట, హిమాయత్‌సాగర్ జలాశయాల సమీపంలో అధిక సంఖ్యలో బడాబాబుల నిర్మాణాలే ఉన్నాయి. రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, సినీ ప్రముఖులు, ఇతర బడాబాబులకు సంబంధించిన చాలా ఫాంహౌస్‌లు, రిసార్ట్స్ గండిపేట, హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల పరిధిలోనే ఉన్నాయి. హైడ్రా అధికారులు వీటన్నింటినీ గుర్తించి కూల్చివేతలు చేపట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో ఉన్న నిర్మాణాలను పలుమార్లు పరిశీలించారు. ఎక్కడి వరకు ఎఫ్‌టీఎల్, ఎక్కడి వరకు బఫర్ జోన్ అనే విషయాలను సర్వే చేసి గుర్తించారు. త్వరలోనే హిమాయత్‌సాగర్ జలాశయం పరిధిలో సైతం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల సర్వే నిర్వహిస్తారని సమాచారం. ఇప్పటికే హైడ్రా చర్యలను చాలామంది సమర్థిస్తుండగా కొంతమంది మాత్రం వ్యతిరేకిస్తున్నారు. హైడ్రా అధికారులు ఇదే విధంగా దూకుడు కొనసాగిస్తే చాలా మంది బడాబాబులకు సంబంధించిన అక్రమ నిర్మాణాలు నేలమట్టమయ్యే అవకాశం ఉంది.

అక్రమ నిర్మాణాలపై కొరడా



చిలుకూరు పరిధి గండిపేట చెరువు ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణం కూల్చివేత

అక్రమ నిర్మాణాలపై హైడ్రా అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా నిర్మించిన భవనాలను నేలమట్టం చేస్తున్నారు. గండిపేట చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన భవనాలను ఆదివారం కూల్చివేశారు. అప్పోజీగూడ, చిలుకూరు పంచాయతీల పరిధిలో ఉన్న వెస్ట్‌సైడ్ వెంచర్‌లో గండిపేట చెరువు ఎఫ్‌టీఎల్‌ను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఒక్కో భవనం సుమారు 500-1000 గజాల్లో మూడు అంతస్తులతో నిర్మించారు. ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలపై ఇటీవల పత్రికల్లో వచ్చిన కథనాలతో హైడ్రా, జల మండలి అధికారులు స్పందించారు. పది రోజులుగా గండిపేట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని పరిశీలించి అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను గుర్తించారు. ఆదివారం ఉదయం 7గంటలకే హైడ్రా అధికారులు మల్లికార్జున్, చరణ్, జలమండలి డీజీఎం నరహరి, జలమండలి విజిలెన్స్ అధికారి డీకే లక్ష్మిరెడ్డి, ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ రెడ్డి భారీ పోలీసు బందోబస్తుతో వెస్ట్‌సైడ్ వెంచర్‌లోకి చేరుకుని ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన భవనాలను కూల్చివేశారు. అప్పోజీగూడ పంచాయతీ పరిధిలోకి వచ్చే మూడు భవనాలు, చిలుకూరు పరిధిలోకి వచ్చే ఒక భవనాన్ని కూల్చివేశారు. క్రికెట్ మైదానాన్ని ధ్వంసం చేశారు.ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, నాలాలపై అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

హైడ్రా చర్యలను స్వాగతిస్తున్నాం



ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటానికి హైడ్రా అధికారి రంగనాథ్ చేపడుతున్న చర్యలు సాహ సోపేతమైనవి. ఇలాంటి చర్యలను స్వాగతిస్తున్నాం. ఆదిబట్ల, శంషాబాద్, తుక్కుగూడ,మొయినాబాద్, శంకర్‌పల్లి,గండిపేట, 111 జీవో ప్రాంతాల్లో నిర్మాణ కంపెనీలు చెరువులు, కుంటలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నాయి. వీటిపైన కూడా చర్యలు తీసుకోవాలి. పలుకుబడి ఉన్న రాజకీయ నాయకులు కబ్జాలు చేసిన భూములను కాపాడేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. హైడ్రా అధికారి రంగానాథ్‌పై కొంత మంది రాజకీయ నాయకులు బెదిరింపులకు దిగుతున్నారు. అలాంటి వారిని ప్రభుత్వం ఉపేక్షించరాదు. కబ్జాలు, ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటల వివరాలను తెలియజేయాలని హైడ్రా కోరుతోంది. ఇప్పటికే కొన్ని వివరాలు ఇచ్చాం. మరిన్ని వివరాలు కూడా తెలియజేస్తాం.

– కాడిగళ్ల భాస్కర్, సీపీఎం జిల్లా కార్యదర్శి

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

కొత్తూరు: ఆధ్యాత్మికత అల్లుకున్న గ్రామాల్లో ప్రజలు సుఖశాంతులతో ఉంటారని మహబూబ్‌నగర్ జిల్లా ఎంపీ డీకే అరుణ అన్నారు. కొత్తూరు పట్టణంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ ఆలయాల ప్రారంభోత్సవ పూజా కార్యక్రమాలకు ఆదివారం ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆధ్యాత్మికత అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఇతరుల పట్ల ప్రేమానురాగాలతో మెలుగుతారని వివరించారు. అంతకు ముందు స్థానిక ఎమ్మెల్యే శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాగునీటికి తండ్లాట

- రెండు రోజులుగా నిలిచిపోయిన నీటి సరఫరా
- ‘మిషన్ భగీరథ’లో సాంకేతిక సమస్యలు
- కాగ్నా రక్షిత మంచినీటి పథకాన్ని పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



కొడంగల్ మిషన్ భగీరథ ప్లాంట్

కొడంగల్: నియోజకవర్గంలో రెండు రోజులుగా తాగునీరు సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మిషన్ భగీరథలో సాంకేతిక సమస్యలు ఉన్నందున నీరు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. మిషన్ భగీరథలో సమస్యలు వస్తే నియోజకవర్గ ప్రజలు ఇబ్బంది పడొద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాగ్నా రక్షిత మంచినీటి పథకాన్ని పునరుద్ధరించారు. కాగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఈ పథకాన్ని గాలికి వదిలేసినట్లు తెలుస్తోంది. కాగ్నా రక్షిత మంచినీటి పథకంలో పనిచేసే సిబ్బంది ఇతర అవసరాల కోసం వాడుకుంటున్నారనే విమర్శలున్నాయి. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా ఏప్రిల్ 13న కాగ్నా పథకాన్ని సందర్శించారు. అదే రోజు కాగ్నా మంచినీటి పథకాన్ని పునఃప్రారంభించారు. కొన్ని రోజులు క్రమం తప్పకుండా కొనసాగింది. వర్షాలు కురిసి నీరు ఒండ్రు వస్తుందనే కారణంగా నీటి సరఫరా నిలిపివేశారు. దీంతో నియోజకవర్గ ప్రజలు మిషన్ భగీరథ నీరందక.. కాగ్నా రక్షిత మంచినీటి పథకం పనిచేయక ఇబ్బంది పడుతున్నారు.

సామర్థ్యం తగ్గడంతో సమస్యలు

మిషన్ భగీరథ పథకం ద్వారా నియోజకవర్గంలో ఇంటింటికీ తాగునీరు సరఫరా చేసేవారు. దీంతో నియోజకవర్గ ప్రజల దాహార్తి తీరింది. కొంత కాలంగా మిషన్ భగీరథ పథకంలో సాంకేతిక సమస్యలు వేధిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పథకం పరిస్థితి ఆందోళనకరంగా మారింది. శ్రీశైలం నుంచి వచ్చే నీటి సామర్థ్యం తగ్గింది. దీంతో కొడంగల్ మున్సిపల్ పరిధిలోని గ్రామాలకు కూడా తాగునీటి సరఫరా చేసే పరిస్థితి లేదని సంబంధిత సిబ్బంది వాపోతున్నారు. పట్టణంలోనూ తగినంత నీటి సరఫరా కావడం లేదు. పథకం ప్రారంభమైన కొత్తలో ఉదయం రెండు గంటల పాటు నీటిని సరఫరా చేసేవారు. ప్రస్తుతం ఒక గంట వదులుతున్నారని మహిళలు వాపోతున్నారు.

కోట్ల రూపాయలు ‘కాగ్నా’పాలు

కాగ్నా రక్షిత మంచినీటి పథకాన్ని అధికారులు ఐదు నెలల క్రితం పునరుద్ధరించారు. కాగా మూడు నెలలుగా కాగ్నా నీరు వాడుకలో లేదు. కోట్ల రూపాయలు పెట్టి మరమ్మత్తులు చేసిన పథకం ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. గతంలో ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లోని 39 గ్రామాలకు సమగ్ర రక్షిత మంచినీటిని అందించాలనే ఉద్దేశంతో కాగ్నా పథకాన్ని రూపొందించారు. సుమారు 30 మంది సిబ్బంది పని చేసేవారు. ఈ పథకం ద్వారా కాగ్నా వాగు నుంచి నీటిని కొడంగల్‌లోని సంప్‌హౌజ్‌కు తరలించేవారు. అక్కడ నుంచి గ్రామాలకు సరఫరా చేసేవారు. ప్రతీ ఏడాది సుమారు రూ.45 లక్షలు వెచ్చించి పథకాన్ని నడిపేవారు. అధికారులు ఈ పథకానికి తిరిగి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

మరమ్మతులు కొనసాగుతున్నాయి

మిషన్ భగీరథ పథకంలో సాంకేతిక సమస్యలు రావడం వల్ల మరమ్మతులు చేపడుతున్నాం. దీంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పై నుంచి నీరు వస్తే నియోజకవర్గ ప్రజలకు సరఫరా చేస్తాం. కాగ్నా నీటిని ప్రస్తుతం వాడుకోవడం లేదు. వర్షాకాలం కావడంతో నీరు ఒండ్రుగా వస్తుందని ప్రజలు ఫిర్యాదు చేశారు. దీంతో కాగ్నా నీటిని తీసుకోవడం లేదు. సమస్య పరిష్కరించగానే నీటిని సరఫరా పునరుద్ధరిస్తాం.

– శశాంక్ మిశ్రా, డీఈఈ

క్లుప్తంగా

చికిత్స పొందుతున్న మాజీ సర్పంచ్ మృతి


చంద్రప్ప (ఫైల్)

పెద్దేముల్: చికిత్స పొందుతూ మండలంలోని గోపాల్‌పూర్ మాజీ సర్పంచ్ ఆదివారం మృతి చెందారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చంద్రప్ప(42) వారం రోజుల క్రితం ఇంట్లో కాలు జారి కింద పడ్డారు. ఆయన తలకు తీవ్ర గాయం కావడంతో వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడే ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చంద్రప్ప మృతి చెందారు. ఆయన స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి


రవీందర్ (ఫైల్)

ధారూరు: విద్యుదాఘాతానికి గురై ఓ కూలీ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని తిమ్మానగర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుర్రం రవీందర్(27) స్థానికంగా ఉన్న ఓ ఫాంహౌజ్‌లో పనిచేస్తున్నాడు. అందులో రవీందర్ తనకున్న రెండు గేదెలను ఉంచి పాలు తీసి విక్రయిస్తుంటాడు. శనివారం రాత్రి ఇంటి నుంచి ఆయన ఫాంహౌజ్‌కు వెళ్లి తిరిగి రాలేదు. మరుసటి రోజు ఉదయం గ్రామస్తులు ఫాంహౌజ్‌కు వెళ్లి చూడగా రవీందర్ కరెంట్ స్తంభం వద్ద విగతజీవిగా పడి ఉన్నాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై తన భర్త మృతి చెందాడని రమ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కుటుంబ యజమాని మృతితో భార్య, ఇద్దరు ఆడపిల్లలు అనాథలయ్యారు. వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబీకులకు మృతదేహాన్ని అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'రైతులను మోసం చేసిన సర్కారు'

తాండూరు రూరల్: అసెంబ్లీ ఎన్నికల ముందు రూ.రెండు లక్షల రుణమాఫీ మాటిచ్చి, గెలిచిన తర్వాత రైతులను సీఎం రేవంత్ రెడ్డి సర్కారు మోసం చేసిందని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాళ్ల సంజీవ్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం అందరికీ రుణమాఫీ కాకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు రుణమాఫీ కానీ రైతులతో బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. వెంటనే అన్నదాతలందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రేమానుబంధాలకు ప్రతిరూపం

రక్షగా ఉండాలని సోదరీమణుల బంధనాలు

- తోబుట్టువులతో ఆప్యాయతను పంచుకుంటున్న ఆడపడుచులు
- నేడు రాఖీ పౌర్ణమి

అన్నా చెల్లెళ్ల అనురాగం, అక్కా తమ్ముళ్ల ఆప్యాయతలకు ప్రతిరూపమే రక్షాబంధన్. సోదరులు కష్టకాలంలో తమకు ఆపన్నహస్తం అందించి బాసటగా నిలవాలని ప్రతి ఆడబిడ్డ కోరుకుంటుంది. అలాగే సోదరులకు ఏ ఆపద కలగొద్దని అనాది నుంచి రాఖీ పౌర్ణమి నిర్వహిస్తున్నారు. ఈ ప్రేమానురాగాల పండగతో తమకు విడదీయరాని బంధం ఉందని జిల్లాలోని పలువులు సోదర సోదరీమణులు పేర్కొంటున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా అవి మీ కోసం..

– సాక్షి, నెట్‌వర్క్


ఆమనగల్లు: రాఖీలు కొనుగోలు చేస్తున్న అతివలు


ఇబ్రహీంపట్నం: షాపులో రాఖీలను కొనుగోలు చేస్తున్న చిన్నారులు


చేవెళ్లలో: ఓ దుకాణంలో పిల్లల కోసం ప్రత్యేక రంగుల్లో ఉన్న రాఖీలు


మొయినాబాద్: ప్రత్యేకంగా ఏర్పాటు చేసి షాపులో రాఖీలు కొంటున్న మహిళలు


కడ్తాల్: రాఖీలు కొనుగోలు చేస్తున్న ఆడపడుచులు

సందడే..సందడి


చౌదర్‌పల్లిలో చెల్లెళ్లతో రాఖీ కట్టించుకుంటున్న శ్రీశైలం (ఫైల్)

యాచారం: రాఖీ అంటే మాకు పెద్ద సంబురం. ఏ పండుగకు చెల్లెల్లు రాకున్నా రాఖీ రోజు నలుగురు చెల్లెల్లు, వారి పిల్లలు, మా పిల్లలతో ఇల్లు మొత్తం సందడిగా ఉంటుంది. నేను బీఎన్‌రెడ్డినగర్‌లో ఉంటునప్పటికీ రాఖీ రోజు మా స్వగ్రామం చౌదర్‌పల్లికి వెళ్తాను.

– జుట్టు శ్రీశైలంకుర్మ, చౌదర్‌పల్లి, రియల్ వ్యాపారి

ఉపాధ్యాయిలే మాకు రక్ష


ఉపాధ్యాయురాలికి రాఖీ కడుతున్న అనాథ విద్యార్థులు

పెద్దేముల్: అనాథ విద్యార్థులకు ఉపాధ్యాయులే సోదరులయ్యారు. మండలంలోని మారెపల్లి శివారులో ఉన్న కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయంలో వైష్ణవి, అశ్విని, పూజ, వైష్ణవి, గంగుబాయ్ అనే విద్యార్థులు హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. వీరికి తల్లిదండ్రులు లేకపోవడంతో రాఖీ పండుగకు ఇంటికి వెళ్లలేని పరిస్థితి. దీంతో తమకు విద్యాబుద్ధులు నేర్పిన సాంఘికశాస్త్రం ఉపాధ్యాయులు ఉమారాణికి విద్యార్థులు ఆదివారం రాఖీ కట్టి రక్షగా ఉండాలని కోరారు.

ఎక్కడ ఉన్నా మరిచిపోదు


నర్సింహారెడ్డికి రాఖీ కడుతున్న మాజీ మంత్రి సబితారెడ్డి (ఫైల్)

తాండూరు రూరల్: నాకు ఇద్దరు అక్కలు. ఒకరు రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, మరొకరు సద్గుణ గృహిణి. ముఖ్యంగా అక్క సబితారెడ్డి రాజకీయాల్లో ఎంత బిజీగా ఉన్నా పండుగకు ఇంటికి వచ్చి నాకు రాఖీ కడుతుంది. ఎంత ఉన్నతస్థాయిలో ఉన్నా తమ్ముడిని మరవదు. చిన్నప్పుడు మా అక్కలు నాపై చూపిన ప్రేమను మరిచిపోను. ఎమ్మెల్యేగా సబితారెడ్డి తన బాధ్యతలు నిర్వర్తిస్తూనే సోదరుడికి సైతం ప్రాధాన్యం ఇస్తారు.

– మాజీ మంత్రి సబితారెడ్డి సోదరుడు నర్సింహారెడ్డి

అనుబంధానికి ప్రతీక


స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు రాఖీ కడుతున్న మధుఅక్కయ్య

అనంతగిరి: అన్నా చెల్లెళ్లు– అక్కా తమ్ముళ్లు జరుపుకొనే మహోత్తరమైన పండుగ రక్షాబంధన్ అని శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం సాయంత్రం వికారాబాద్ పట్టణంలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఓం శాంతి భవనంలో జరిగిన రక్షా బంధన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు మధు అక్కయ్య స్పీకర్‌కు తిలకం దిద్ది రాఖీ కట్టి మిఠాయి తినిపించారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ.. తమ సోదరుడు సుఖ సంతోషాలతో మహోన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటూ కట్టేదే రాఖీ పండుగ అన్నారు. నాకు అక్కచెల్లెళ్లు ఉన్నారని, నేను ఒక్కడినే సోదరున్ని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేశ్‌కుమార్, రాష్ట్ర హౌసింగ్ బోర్డు మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ గోపాల్, డీసీఎంఎస్ మాజీ మేనేజర్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతరాలు దాటిన అనుబంధం


వెంకటేశ్‌గుప్తాకు రాఖీ కడుతున్న నిర్మల (ఫైల్)

తలకొండపల్లి: సోదర సోదరీమణుల మధ్య అనుబంధానికి ప్రతిరూపమే రాఖీ పండుగని మాజీ ఎంపీపీ తిర్మణి నిర్మలాశ్రీశైలం గౌడ్ అన్నారు. ఏ బంధుత్వం లేకపోయినా సోదరుడు, సోదరి అనే భావన ఉన్న ప్రతిఒక్కరూ రక్షాబంధనాన్ని కట్టి వారి క్షేమాన్ని కోరవచ్చన్నారు. అందుకు చిహ్నంగా ఏటా మాజీ ఎంపీపీ నిర్మల, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్‌గుప్తాను అన్నగా భావించి, ఆయన ఇంటికి వెళ్లి రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకుంటారు.

"పోస్టులో పంపిస్తాం



పరిగి: మా తమ్ముడు దండు శ్రీనివాస్ ఆర్మీలో ఉద్యోగం చేస్తూ కాశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. దేశ రక్షణకోసం బార్డర్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. మేము ఇద్దరం అక్కలం. మా తమ్ముడికి ప్రతీ సంవత్సరం పోస్టు ద్వారా రాఖీ పంపిస్తున్నాం. 14 సంవత్సరాలు పోస్టు ద్వారానే పంపించాం. పది రోజుల ముందు రాఖీ పంపించి సమాచారం అందజేస్తాం. తమ్ముడు రా ఖీ కట్టుకుని అక్క చెల్లెల బంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆరోజు ఆనందంగా ఉంటాడు.

– భాగ్యలక్ష్మి, కుల్కచర్ల, పరిగి

విధుల్లో ఉన్నా రాఖీ కడుతా


తమ్ముడికి రాఖీ కడుతున్న సుభాషిణి (ఫైల్)

పరిగి: మా తమ్ముడు నేను కవలలం. తను ఎక్కడ విధుల్లో ఉన్నా రాఖీ రోజు తప్పకుండా కడుతా. తను వృత్తి రీత్యా పోలీస్ కానిస్టేబుల్. ఎక్కడ ఉన్నా సరే రాఖీ కడితేనే సంతృప్తి. తన విధుల్లో ఉన్నా రాఖీ కట్టేందుకు వెళ్తా.

– సుభాషిణి, పరిగి

తమ్ముడు లేని లోటు తీరింది!


పెదనాన్న కొడుక్కి రాఖీ కడుతున్న నవీన (ఫైల్)

దుద్యాల్: మేము ఇద్దరం అక్కాచెల్లెలం నవీన, రిషిక, తమ్ముడు భౌతిక్ ఉండేవాళ్లం. 2017లో మా తమ్ముడు ఆరోగ్య సమస్యతో దూరమయ్యాడు. అప్పటి నుంచి రాఖీ పండుగకు దూరంగా ఉండే వారం. రాఖీ కట్టడానికి తమ్ముడు లేడనే బాధ మాలో ఉండేది. కానీ మా పెదనాన్నకు, చిన్ననాన్నకు పుత్ర సంతానం కలగడంతో తమ్ముడు లేని లోటు తీరింది. వారికి రాఖీలు కట్టి పండుగ చేసుకుంటున్నాం.

– నవీన, ఇంటర్ విద్యార్థి, హస్నాబాద్

ఎకో రాఖీని ఆదరిద్దాం


పర్యాటకులకు ఎకో రాఖీలు పంపిణీ చేస్తున్న మాజీ చైర్‌పర్సన్

అనంతగిరి: వికారాబాద్ పట్టణానికి సమీపంలోని అనంతగిరి గుట్టలో తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొ్ౖత్రిక విజయలక్ష్మి పర్యాటకులకు ఎకో రాఖీలు పంచి పెట్టారు. దీర్ఘాయుష్ అనే సంస్థతో కలిసి ప్రకృతిని కాపాడాలంటూ ఆవు పేడతో తయారు చేసిన రాఖీలను టూరిస్టులకు అందించారు. ప్రకృతిని కాపాడుదాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే నినాదంతో అక్కడున్న ప్రజలకు వివరించారు.

– విజయలక్ష్మి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, తాండూరు

యూఎస్ నుంచి పంపించాను



మాది వికారాబాద్ పట్టణం. నేను తమ్ముడికి ప్రతిసారి నేరుగా రాఖీ కడతాను. ఈ ఏడాది మాత్రం ఉన్నత చదువుల కోసం యూఎస్ వచ్చాను. తమ్ముడిని చాలా మిస్ అవుతున్నా. ప్రస్తుతం రాఖీని కొరియర్‌లో పంపిస్తున్నా. రాఖీ పండుగ వచ్చిందంటే మా ఇంట్లో పండుగ వాతావరణం ఉంటుంది.

– వైష్ణవిగౌడ్, స్టూడెంట్, యూఎస్

అదుపుతప్పి డీసీఎం బోల్తా

క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్


తీవ్ర గాయాలతో డ్రైవర్

పరిగి: రసాయన పురుగుల మందులు తరలిస్తున్న డీసీఎం అదుపుతప్పి బోల్తా పడటంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని చింతల్‌చెరువు సమీపంలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఏఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెంది డీసీఎం హైదరాబాద్ నుంచి కర్ణాటకకు పురుగుల మందుల లోడ్ వేసుకుని వెళ్తుంది. తెల్లవారుజామున చింతల్ చెరువు మూలమలుపు వద్ద అదుపుతప్పి రేలింగ్‌కు ఢీకొని బోల్తా పడింది. దీంతో డ్రైవర్ మోనేశ్ డీసీఎం క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. రోడ్డుపై వెళ్తున్న వాహనాలు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను జేసీబీ సాయంతో గంటసేపు శ్రమించి బయటకి తీశారు. డ్రైవర్ ఎడమ కాలు పూర్తిగా రెండు ముక్కలుగా కాగా కుడి కాలు విరిగింది. క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నగరానికి తరలించారు. డీసీఎం యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కేశంపేట: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములనర్వ గ్రామంలో రాములు(54) అనారోగ్య సమస్యలతో బాధపడేవాడు. ఈ క్రమంలోనే మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల అనారోగ్య సమస్యలు అధికం కావడంతో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై మృతుడి అల్లుడు నరసింహ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

చేవెళ్ల: పుట్టుకతో వినికిడి, మూగ లోపం ఉన్న ఆరేళ్లలోపు పిల్లలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా ఆపరేషన్లు చేసే సౌకర్యం కల్పిస్తోందని ప్రముఖ ఆడియాలసిస్ట్ డాక్టర్ ఎం.కృష్ణయ్య, డాక్టర్ గోపాల్ తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీసత్యసాయి ఆసుపత్రిలో డాక్టర్ రాజు ఆధ్వర్యంలో ఉచిత వినికిడి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినికిడి సమస్యలు ఉన్న బాధితులు శిబిరంలో వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఈ పరీక్షల్లో పలువురికి చిన్న చిన్న సమస్యలు ఉండగా 20 మంది రోగులకు వినికిడి లోపం ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పుట్టుకతో చెవిటి, మూగ సమస్యలు ఉన్న 6 ఏళ్లలోపు పిల్లలకు ప్రభుత్వమే ఉచితంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం అందిస్తుందని చెప్పారు. ఇది ఎంతో మంచి నిర్ణయమని దీనిని ప్రజలు గుర్తించి చిన్నతనంలోనే బాగు చేయించుకోవాలన్నారు. బయటయతే పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుందన్నారు. వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

వర్షాల కోసం మహిళల కప్పాట

శంషాబాద్ రూరల్: వాన దేవుడు కరుణించాలని మహిళలు పాటలు పాడుతూ కప్పాటతో ఊరేగారు. మండలంలోని మల్కారంలో ఆదివారం గ్రామంలో నాగలి దున్నేందుకు వాడే కాడిమాకుకు కప్పలను వేలాడదీసి, వేప కొమ్మలతో అలంకరించి వీధుల్లో తిరిగారు. ఈ ఏడాది సరిగ్గా వర్షాలు కురవక సాగుకు ఇబ్బందులు పడుతున్నారు.

వ్యక్తి మృతి

మైలార్‌దేవ్‌పల్లి: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం దుర్గానగర్ చౌరస్తాలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలాకి చేరుకున్న పోలీసులకు అతను భిక్షాటన చేస్తుండేవాడని తెలియడంతో కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న కారు

ఒకరికి గాయాలు

ఖైరతాబాద్: అదుపు తప్పినబీఎండబ్ల్యూ కారు డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న ఒకరికి గాయాలయ్యాయి. ఖైరతాబాద్ ఎస్ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ... ఆదివారం ఉదయం హిమాయత్‌నగర్‌కు చెందిన జితేష్(24) బీఎండబ్ల్యూ కారులో తన స్నేహితురాలు కనిష్క(20), ఆమె సోదరుడు చిరావ్ శర్మ(14)తో కలిసి బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌కు బయల్దేరారు. కారు బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణ, తాజ్ దక్కన్ రోడ్డులో ఉన్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి కిందికి రాగానే సన్‌రూఫ్ ఓపెన్ చేసి నిలడిన చిరావ్ శర్మ కాలు తగిలి, డ్రైవింగ్ చేస్తున్న జితేష్ సీటు బెల్టు ఊడిపోయింది. జితేష్ సీటు బెల్టు పెట్టుకునేందుకు కిందికి వంగిన సమయంలో కారు అదుపు తప్పి డివైడర్ మధ్యలో ఉన్న సిమెంట్ దిమ్మె, విద్యుత్ పోల్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో చిరావ్ శర్మ ముఖానికి గాయాలయ్యాయి. కారులో ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో మిగతా ఇద్దరికి ఎలాంటి గాయాలు కాలేదు. ఘటనలో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురి సభ్యత్వం రద్దు

- ముస్లిం అసోసియేషన్‌కు వ్యతిరేకంగా పని చేస్తున్నారని నిర్ణయం
- ప్రకటించిన అధ్యక్షుడు కమల్‌అక్తర్, ప్రధాన కార్యదర్శి ఖాలీద్‌సైఫుల్లా


సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి ఖాలీద్‌సైఫుల్లా

తాండూరు: అసోసియేషన్‌కు వ్యతిరేకంగా పని చేస్తున్న నలుగురు సీనియర్ నాయకుల సభ్యత్వం రద్దు చేస్తున్నామని ముస్లిం వెల్ఫేర్ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం తాండూరు పట్టణంలోని ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కమల్‌అత్తర్ అధ్యక్షతన కాంప్లెక్స్‌లో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో సాధారణ సమావేశం నిర్వహించారు. అసోసియేషన్‌కు వ్యతిరేకంగా పని చేస్తున్న ఎంఐఎం పార్టీ నేత అబ్దుల్ హాదీషహరి, మాజీ అధ్యక్షుడు కుర్షిద్‌హుస్సేన్‌లతో పాటు సీనియర్ సభ్యులు సత్తార్ ముజహిద్, అబ్దుల్ రహమాన్ ముజహిద్‌ల సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కమల్‌అక్తర్, ప్రధాన కార్యదర్శి ఖాలీద్‌సైఫుల్లా ప్రకటించారు. అసోసియేషన్ సభ్యులపై బెదిరింపులకు దిగడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. మరోవైపు ముస్లింకు నూతన సభ్యత్వ నమోదు చేసుకొనే అవకాశం కల్పించారు. అసోసియేషన్ దుకాణ సముదాయంలో అద్దెకు ఉంటూ చెల్లించని యజమానులను ఖాళీ చేయించి కొత్త వారికి అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ బోర్డు అడ్వైజర్ అబ్దుల్‌అహాద్, మాజీ అధ్యక్షులు మహ్మద్‌బాబర్, నాయకులు ఎండీ అలీం, తహేర్‌ఖురేషి, ఫరూర్, యూనూస్, సయ్యద్ బాసీద్ అలీ, అబ్దుల్ సలీం, ఖయ్యూమ్, సాజిద్‌పాష, సిరాజుద్దిన్, హమీద్, లతీఫ్, అసాద్, సభ్యులు తదితరులున్నారు.

బెట్టింగ్‌లో చీటింగ్

పోలీసుల అదుపులో నలుగురు నిందితులు

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లోని హైదరాబాద్ రేస్ క్లబ్ ఆఫ్ కోర్స్ టోట్ సెంటర్‌లో నిబంధనలకు విరుద్ధంగా బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురిని ఖైరతాబాద్ పోలీసులు గేమింగ్ యాక్ట్ కింద అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం....ఖైరతాబాద్‌లోని రేస్ క్లబ్‌లో బెట్టింగ్ చేయాలంటే టికెట్ తీసుకొని నిబంధనల ప్రకారం నడుచుకోవాలి. కానీ, కాచిగూడకు చెందిన మహేష్ (69), మల్లేపల్లికి చెందిన హసద్ అహ్మద్(36) నిబంధనలకు విరుద్ధంగా గ్యాంగ్‌గా ఏర్పడి బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారని సెక్యూరిటీ సూపర్‌వైజర్ షా నవాజ్ గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా మహేశ్, హసద్‌తోపాటు బెట్టింగ్ ముఠాలోని సాయిలు (36), షేక్ అక్బర్ (48)లను అదుపులోకితీసుకున్నారు.

ఉద్యమ నేతకు పట్టాభిషేకం

టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్


ఎమ్మెల్సీ కోదండరాంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

బొంరాస్‌పేట: స్వరాష్ట్ర సాధనకు విశేష కృషి చేసిన ఉద్యమ నేత కోదండరాంకు ఎమ్మెల్సీ పదవి దక్కడం అభినందనీయమని తెలంగాణ విద్యావంతుల వేదిక(టీవీవీ) రాష్ట్ర కార్యదర్శి కె.రవీందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కోదండరాంను టీవీవీ, టీజేఎస్ నాయకులు కలిసి శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ కలలు గన్న స్వరాష్ట్ర సాధనకు కోదండరాం అవిరల కృషి చేశారన్నారు. అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా కోదండరాం ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ సేవలందించాలన్నారు. నీళ్ల, నిధులు, నియామకాలు సంపూర్ణంగా తెలంగాణ ప్రజలకు అదేవిధంగా కృషి చేయాలని కోరామన్నారు. త్వరలో కొడంగల్‌కు రావాలని జిల్లా కోశాధికారి గోరారం గోపాల్ ఆహ్వానించగా కోదండరాం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీజేఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సోమశేఖర్, టీవీవీ జిల్లా అధ్యక్షుడు వెంకట్రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు మధన్‌రెడ్డి, ఎంతఊట హరిశ్చందర్, గ్రంథాలయకర్త హన్మయ్య పాల్గొన్నారు.